క్లుప్తంగా

మంచినీటి వృథాను అరికట్టండి



తెనాలిఅర్బన్: వీఎస్ఆర్ కళాశాల వద్ద ఉన్న రక్షిత మంచినీటి పంపు సెట్ వద్ద నీరు వృథాగా పోతోంది. దానిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు అసిస్టెంట్ కమిషనర్ అనూషాకు అర్జీ అందజేశారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఏసీ స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు పంపి, తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

తెనాలి వాసి సాదిక్‌కు సన్మానం



తెనాలిఅర్బన్: యువ జనరేషన్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు షేక్ సాదిక్‌ను యువతరం సేవా సమితి నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. శ్రీకాళహస్తిలో యువతరం సేవా సమితి 10వ వార్షికోత్సవాలను ఆదివారం నిర్వహించారు. వేడుకలలో సాదిక్‌ను సన్మానించినట్లు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సాదిక్ మాట్లాడుతూ తమ సంస్థ సేవలను యువతరం సేవా సమితి గుర్తించటం సంతోషకరమన్నారు. రానున్న రోజుల్లో తెనాలిలో మరిన్ని సేవా కార్యక్రమాలు తమ సంస్థ ద్వారా చేస్తామని చెప్పారు. సన్మానం పొందిన సాదిక్‌కు పలువురు పట్టణ వాసులు అభినందనలు తెలిపారు.

పనులలో నాణ్యత ఉండేలా చూడండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న




తెనాలిఅర్బన్: పనులలో నాణ్యత లోపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని పలు అన్న క్యాంటిన్ భవనాలను సోమవారం ఆయన పరిశీలించారు. అక్కడ చేస్తున్న మరమ్మతులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. త్వరగా పనులు పూర్తి అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

పుస్తకాల పంపిణీ



తెనాలి: పట్టణానికి చెందిన సత్యసాయి చేయూత సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అయితా నగర్‌లోని ఎస్ఎస్ఎస్ఎం హైస్కూలులో వందమంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. వీటితోపాటు కాలుష్య రహిత పేపర్ పెన్నులు, డెంగీ వంటి వ్యాధులు రాకుండా హోమియో మందులు అందజేశారు. దాతల సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పలువురు సూచించారు. సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అధ్యక్షుడు చుండూరి వెంకట శివప్రసాద్, కార్యదర్శి కొత్తమాసు వినోద్, కోశాధికారి చుండూరి రఘురామ్ గుప్తా తెలియజేశారు.

మహనీయుల పోరాట ఫలితమే స్వాతంత్ర్యం



పెదకాకాని: మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యమని ఉపన్యాసకుడు సంగిరెడ్డి హనుమంతరెడ్డి చెప్పారు. పెదకాకాని మండలం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న జెమ్స్ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు భారత స్వాతంత్ర ఉద్యమంపై అవగాహన కలిగించారు. కార్యక్రమానికి అవర్ స్టేట్ అవర్ లీడర్ అండ్ ఇండియన్ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు జి శాంత మూర్తి అధ్యక్షత వహించారు.

వరుస చోరీలు.. ప్రజలు బెంబేలు

- తెనాలిలో హడలెత్తిస్తున్న వరుస దొంగతనాలు
- నాలుగు రోజుల వ్యవధిలో మూడు ఘటనలు
- తాళం వేసిన ఇళ్లే టార్గెట్...
- రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులనూ వదలని వైనం



టైర్ల షోరూంలోకి ప్రవేశిస్తున్న దుండగుడు



చెంచుపేటలోని అపార్ట్‌మెంట్‌లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

తెనాలిరూరల్: పట్టణంలో ఇటీవల జరుగుతున్న వరుస చోరీలు కలకలం సృష్టిస్తున్నాయి. రోజుల వ్యవధిలోనే జరిగిన భారీ చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంచుకుంటున్న కొందరు దొంగలు దర్జాగా లోపలికి వెళ్లి విలువైన ఆభరణాలు, నగదు దర్జాగా అపహరించుకుపోతున్నారు. పగలంతా రెక్కీ నిర్వహించి... ఇంటి యజమానులు ఊరిలో లేరని తెలుసుకుని.. రాత్రిళ్లు దొంగతనాలకు పాల్పడుతున్నారు. తెనాలి పట్టణంలో గడిచిన నాలుగు రోజుల వ్యవధిలో రెండు నివాస గృహాల్లో.. ఓ టైర్ల షోరూమ్‌లో భారీ చోరీలు జరగడం, మూడు చోట్లా పెద్ద మొత్తంలో సొత్తు అపహరణకు గురికావడం చూస్తుంటే దొంగలు ఏ విధంగా రెచ్చిపోతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల జరిగిన ఈ మూడు చోరీలు కూడా తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే జరగడం గమనార్హం.

పట్టణంలోని చెంచుపేట మార్గ్ అపార్ట్‌మెంట్లో ఫ్లాట్ నంబరు బీ - 10లో భారీ చోరీ శుక్రవారం వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఫ్లాట్‌లో ఒంటరిగా నివసిస్తున్న సుజాత అనే మహిళ గత బుధవారం రాత్రి తిరుమల వెళ్లగా ఇదే అదనుగా భావించిన దుండగులు అర్ధరాత్రి ఫ్లాట్‌లోకి చొరబడి రూ. 80 వేల నగదుతో పాటు 37 సవర్ల బంగారం ఆభరణాలు, వెండి దిమ్మలు, వస్తువులు అపహరించుకు వెళ్లారు. నిందితుడి కదలికలు అపార్ట్‌మెంట్‌లో ఉన్న సీసీ కెమెరాల్లో కూడా రికార్డు అయినట్లు తెలుస్తోంది.

ఇవే కాకుండా.. రెండు వారాల క్రితం ఓవర్ బ్రిడ్జిపై మోరిస్‌పేట నుంచి చెంచుపేట వైపునకు నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుని చేతిలోని సంచిని బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు లాక్కెళ్లారు. రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి సెల్ ఫోన్‌ను చోరీ చేశారు. మరో ఘటనలో రైల్వేస్టేషన్‌లోనే సెల్‌ఫోన్‌ను అపహరించుకెళ్లే ప్రయత్నంలో కత్తితో దాడి చేసి నిందితుడు పరారయ్యాడు.

వరుస చోరీలపై అటు బాధితులు, ఇటు పోలీసులు కూడా వివరాలు వెల్లడించేందుకు నిరాకరిస్తున్నారు. మొత్తం మీద రోజుల వ్యవధిలో వరుసగా జరుగుతున్న ఈ చోరీలు అటు పోలీసులను, ఇటు ప్రజానీకాన్ని కలవరపాటుకు గురి చేస్తున్నాయి. చోరీలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

ఆదే విధంగా స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని ఓ టైర్ల షోరూమ్‌లో జరిగిన చోరీ ఘటన కూడా సోమవారం వెలుగు చూసింది. ఇక్కడకున్న ఓ టైర్ల షోరూమ్ వెను భాగంలో ఇనుప గేటుకు వేసి ఉన్న తాళాన్ని పగులగొట్టిన దుండగుడు లోనికి ప్రవేశించి రూ. 2.50లక్షల నగదు అపహరించుకెళ్లాడు. శనివారం రాత్రి షోరూం మూసి వెళ్లిన యజమానులు వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. త్రీ టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్ టీమ్ రంగంలోకి దిగింది. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. నిత్యం జన సంచారం ఉండే రైల్వే స్టేషన్ రోడ్డులో ఇంత పెద్ద షోరూంలో దర్జాగా చోరీ జరగడం పోలీసులకు సవాల్‌గా మారింది. నాలుగు రోజుల వ్యవధిలో జరిగిన ఈ మూడు చోరీ ఘటనలు కూడా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే జరిగాయి.

చెంచుపేటలోనే.. అపార్ట్‌మెంట్‌లో దొంగతనం మరువక ముందే.. నాలుగవ రోజే అంటే సోమవారం మరో భారీ చోరీ జరిగింది. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావి రవీంద్రనాథ్ బజారులో ఉన్న ప్రజా సంఘాల కార్యాలయం వెనుక నివసిస్తున్న తానంకి సంపూర్ణ శాంతకుమారి నివాసంలో తెల్లవారుజామున చోరీ జరిగింది. ఈమె కొల్లిపర విద్యుత్ శాఖలో అటెండర్‌గా పని చేస్తున్నట్లు తెలిసింది. కర్నూలు నుంచి వచ్చిన తన కుమార్తె ఉదయం 7 గంటలకు బస్సుకు వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో తెల్లవారుజామున 3 గంటలకే లేచిన వీరు ఇంటిలో పని ముగించుకుని నిద్రపోయి.. మరలా 4.30 గంటల సమయంలో లేచి చూడగా ఇంటిలోని ఓ గదిలో ఉండాల్సిన బంగారు నగలు చోరీకి గురయ్యాయి. సుమారు 18 నుంచి 20 సవర్ల బంగారం చోరీకి గురైనట్లు భావిస్తున్నారు. దీంతో ఆమె త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించారు.

ప్రజల అర్జీలకు నిర్ణీత వ్యవధిలో పరిష్కారం

తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అభివృద్ధి సంఘం నేతలు

తెనాలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల సమావేశానికి మొత్తం ఎనిమిది అర్జీలు వచ్చాయి. తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులకు అర్జీలను పంపి, నిర్ణీత వ్యవధిలోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. రెవెన్యూకు సంబంధించి రెండు అర్జీలు, మున్సిపల్ విభాగానికి మరో రెండు అర్జీలు రాగా, వ్యవసాయం, గృహనిర్మాణం, విద్యాశాఖ, పోలీస్ విభాగాలకు సంబంధించి ఒక్కో అర్జీ వచ్చినట్లు వివరించారు.

ట్రాఫిక్ సలహా సంఘ సమావేశం జరపాలి...

పట్టణంలో పెరిగిపోతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ సలహా సంఘ సమావేశాన్ని నిర్వహించాలని ది తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం నాయకులు సబ్ కలెక్టర్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్, డీఎస్పీ, పోలీస్, మోటారు వాహనాల అధికారులు, మున్సిపల్ కమిషనర్, వివిధ శాఖల అధికారులు, ప్రజా సంఘాల సమక్షంలో జరిగే ట్రాఫిక్ సలహా సంఘ సమావేశం రెండున్నరేళ్ల క్రితం జరిగిందని గుర్తుజేశారు. నిబంధనల ప్రకారం ఈ సమావేశాన్ని ప్రతి మూడు నెలలకోసారి జరపాల్సి ఉందన్నారు. సంఘం అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వర రావు, కార్యదర్శి నారాయణం కమల్‌కుమార్, కోశాధికారి అబ్దుల్ ఆరిఫ్, ఉపాధ్యక్షుడు రావూరి శివశంకరరావు, డీవీ సోమయ్యశాస్త్రి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ బిల్లులు ఇప్పించాలి...

జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు తాను చేసిన ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పెండింగు బిల్లులను ఇప్పించాలని కోరుతూ పట్టణ 24వ వార్డుకు చెందిన కాంట్రాక్టర్ ఎం.పున్నారావు సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సచివాలయం సిబ్బంది తనను ఈ పనికి పురమాయించారని, వారు చెప్పిన ధర తనకు గిట్టుబాటు కాదని, ఒక్కో ఇంటికి అదనంగా రూ.10 వేలు ఇప్పించాలని కోరగా, తర్వాత చూద్దామని చెప్పి, తనతో నిర్మాణ పనులు ఆరంభించారని తెలియజేశారు. దీనిపై గృహనిర్మాణ సంస్థ అధికారిని వివరణ కోరారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు వ్యాధినిరోధక శక్తి



ర్యాలీలో పాల్గొన్న సూపర్‌వైజర్ సౌజన్య, అంగన్‌వాడీలు



ప్రతిజ్ఞ చేస్తున్న గర్భిణులు, బాలింతలు

తెనాలిఅర్బన్: నేటి సమాజంలో పిల్లలకు తల్లి పాలు ఇచ్చే సంస్కృతి తగ్గిపోతోందని ఐసీడీఎస్ తెనాలి సూపర్‌వైజర్ కె.సౌజన్య ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని 13వ వార్డులో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతరాలను పూరించి... తల్లి పాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం అనే నినాదంతో వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బిడ్డ పుట్టిన అరగంట తర్వాత ముర్రు పాలను పట్టించాలన్నారు. అలా చేయడం వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి వస్తుందని చెప్పారు. అనంతరం బాలింతలు, గర్భిణులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

తల్లిపాలతో పిల్లలకు ఆరోగ్యం

తల్లిపాలను పట్టటం వల్ల చిన్నారులు ఎంతో ఆరోగ్యంగా ఉంటారని ఆరోగ్య కార్యకర్త శివకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త నాగలక్ష్మి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా 28వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల ఆవశ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలలో ఎన్నో పోషకాలు ఉంటాయని చెప్పారు. అనంతరం గర్భిణులు, బాలింతలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు కొత్త భవనాలు అవసరం

- 'సాక్షి' కథనానికి స్పందన
- మరో రెండింటికి తక్షణ అత్యవసర మరమ్మతులు కావాలి
- సమగ్రశిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ జి.విజయలక్ష్మి

సాక్షి ఎఫెక్ట్

తెనాలి: 'చదువులపై నిర్లక్ష్యపు నీడ' శీర్షికన సాక్షి దిన పత్రికలో సోమవారం ప్రచురితమైన వార్తా కథనానికి సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ జి.విజయలక్ష్మి స్పందించారు. నియోజకవర్గంలోని కొల్లిపర మండలంలోని నాలుగు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నట్లు అంగీకరించారు. మున్నంగిలోని ఎంపీపీఎస్ (యు) పాఠశాల, ప్రస్తుతం అద్దె భవనంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే కొల్లిపరలోని ఎంపీపీఎస్ (ఎల్ఈ) పాఠశాలను కూడా కమ్యూనిటీ హాలులో జరుపుతున్నామని తెలియజేశారు. ఈ రెండు పాఠశాలలకు నూతన భవనాల ఏర్పాటు అవసరం ఉందని తెలిపారు. అదే మండలంలోని దంతలూరులో గల ఎంపీపీఎస్ (ఆర్), గొడపాలెంలోని ఎంపీపీఎస్ పాఠశాలలకు తక్షణ అత్యవసర మరమ్మతుల అవసరం ఉందన్నారు. అడ్మిన్ శాంక్షన్ కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తామని వివరించారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

తెనాలిరూరల్: న్యాయవాదుల మీద అక్రమ కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ తెనాలి బార్ అసోసియేషన్ సభ్యులు విధులను సోమవారం బహిష్కరించారు. గుంటూరు, మంగళగిరిలో న్యాయవాదులపై పోలీసులు అక్రమ కేసులు బనాయించారని న్యాయవాదులు ఆరోపించారు. ఈ సందర్భంగా తెనాలి అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ మాట్లాడుతూ సర్ఫేసీ యాక్టు కింద కేసులో విధుల్లో భాగమైన గుంటూరుకు చెందిన న్యాయవాది బి. నాగరాజుపై పట్టాభిపురం పోలీసులు, తన క్లయింట్లకు బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడని మంగళగిరిలో న్యాయవాది జి. గవాస్కర్‌పై పోలీసులు అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. వెంటనే అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

చికెన్ షాపు నిర్వాహకులకు నోటీసులివ్వండి

- ఎంటీఎంసీ కమిషనర్ ఆదేశం
- నులకపేటలో విస్తృతంగా పర్యటన



నులకపేట బ్రహ్మానందపురంలో డ్రైయినేజీని పరిశీలిస్తున్న ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీంబాషా సోమవారం నులకపేట పరిధిలోని ప్రధాన రహదారిలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా ప్రకాష్‌నగర్, డోలాస్‌నగర్‌లోని ప్రధాన రహదారిలో రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని గమనించి అసహనం వ్యక్తం చేశారు. వారు చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పారబోయడంపై మండలించారు. అనంతరం నులకపేట అన్న క్యాంటీన్ నుంచి నడుచుకుంటూ గుంటూరు చానల్ వరకు వెళ్లి డ్రైనేజీలను పరిశీలించారు. కాలువల్లో కోడిమాంసం వ్యర్థాలు కనిపించడంతో సిబ్బందిని ప్రశ్నించారు. వారి నుంచి సమాధానం రాకపోవడంతో స్థానికంగా చికెన్ షాపులు నిర్వహించే అందరికీ ముందుగా నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కోళ్ల వ్యర్థాలను తరలించే వాహనాలపై కనీసం పట్ట కూడా కట్టడం లేదని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. అదే సమయంలో తెనాలి తాగునీటి పైపులైన్ లీకు కావడంతో అధికారులు తెలియజేయాలని డీఈ కృష్ణారెడ్డిని ఆదేశించారు. నులకపేట కొండ ప్రాంతం నుంచి వచ్చే కచ్చా డ్రైన్‌ను పునరుద్ధరించాలని, కాలువలను ఎవరు ఆక్రమించుకున్నా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేదంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ కిషోర్, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డుల జారీకి వినతి



తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గంలో కొత్త రేషను కార్డుల జారీకి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ షేక్ మహబూబ్ సుభానిని జనసేన నాయకులు కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను ఆయన కార్యాలయంలో సోమవారం జనసేన మంగళగిరి నియోజకవర్గ యువజన విభాగ నాయకులు చిట్టెం అవినాష్ తదితరులు కలిశారు. రేషన్ కార్డులు లేక అనేకమంది ప్రభుత్వ పథకాలు కోల్పోతున్నారని, అర్హులైన వారికి వెంటనే మంజూరు చేయాలని తహసీల్దార్‌ను అవినాష్ కోరారు. తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌కు ఈ సందర్భంగా అవినాష్ జ్ఞాపిక అందించారు.

రజకుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

తాడేపల్లి రూరల్: రజకుల సమస్యలను పరిష్కరించాలని, ఇస్త్రీ చేసుకుంటున్న వృత్తిదారులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లిలోని చాకలి ఐలమ్మ రజక కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సమావేశానికి ఉండవల్లి పార్థసారథి అధ్యక్షత వహించారు. వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంటూరు, తెనాలి, మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల ప్రాంతాల్లో ఇళ్లు లేని వారికి సొంత గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. 50 సంవత్సరాలు దాటిన రజక వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. చాకలి ఐలమ్మ కమ్యూనిటీ హాల్‌ను నగర పాలక సంస్థ ద్వారా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాగోలు శ్రీనివాసరావు, ప్రతినిధులు మారుదాటి సుబ్బారావు, కొండాయగుంట యానాదిరావు, తాడేపల్లి వరప్రసాద్, తాడేపల్లి సాంబశివరావు, పిన్నెల్లి లక్ష్మీనారాయణ, సర్వేపల్లి శివయ్య, డి. వీరాంజనేయులు, పూతలపాటి బాలకృష్ణ, కొత్తపల్లి వీరాంజనేయులు, రాయవలస రాజు, తుమ్మపూడి శివయ్య, మానవరపు నరసింహారావు, దుగ్గిరాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

తాడికొండ: తాడికొండ మండలంలోని లచ్చన్నగుడిపూడి, పాములపాడు, ముక్కామల గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతను కూడా వివరించారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి–హిందూ విజ్ఞాన వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షులు రౌతు శ్రీనివాసరావు, సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ ప్రచారంలో పలు అంశాలను ప్రజలకు వివరించారు. పలువురు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తీర్మానం లేకుండా డబ్బులు డ్రా చేశారు

ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి స్పందన లభించింది. పలు గ్రామాల నుంచి ప్రజలు రకరకాల సమస్యలపై తహసీల్దార్ కె.రవిబాబును కలిసి తమ గోడును వినిపించారు. సానుకూలంగా స్పందించిన ఆయన నిర్దేశిత గడువులోపు సమస్యలకు పరిష్కార మార్గాలను చూపించడం జరుగుతుందని అర్జీదారులకు భరోసానిచ్చారు. ఇటీవల జరిగిన భూముల రీ సర్వే సమయంలో తమ భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలతో పాటు చిన్నచిన్న సమస్యలు తలెత్తినట్లు నలుగురు ఫిర్యాదు చేశారు. ఆదేవిధంగా ఇతరత్రా సమస్యలకు సంబంధించి మరో రెండు అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రత్తిపాడుకు చెందిన పిరానే పీర్ డ్వాక్రా గ్రూపు మహిళలు మీ కోసంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తమకు తెలియకుండా రూ. 86,010 తమకు పొదుపు ఖాతా నుంచి సీసీ లోన్‌కు జమ చేశారని, తాము తీర్మానం చెయ్యకుండా రూ. 3,36,000 అప్పు పుస్తకం నుంచి డ్రా అయ్యాయని, తామంతా అధిక వడ్డీ చెల్లించాల్సి వస్తుందని వాపోయారు.

నియోజకవర్గ మహిళా విభాగం కమిటీ ఎన్నిక



తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణానికి చెందిన బుల్లా శారమ్మను ఏపీ చర్మకార సేవా సంఘం నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా సోమవారం సంఘ రాష్ట్ర అధ్యక్షులు రాజారావు నియమించారు. మంగళగిరి బాప్టిస్ట్ పేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. మహిళా విభాగం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. అధ్యక్షులుగా బుల్లా శారమ్మ, ఉపాధ్యక్షులుగా నందిపాముల సునీత, ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి సుశీల, కార్యదర్శిగా యర్రగుంట సుశీల, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బేతపూడి అచ్యుత, కోశాధికారిగా వేమూరి అంకమ్మలు ఎన్నికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నందిపాముల జోనిబాబు, గొల్లపల్లి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ ఢీకొని మేక మృతి



లారీలు ఆపాలని వాదన



నిలిచిపోయిన ఇసుక లారీలు

- వాహనాలను అడ్డుకున్న టీడీపీ నేతలు
- పోలీసుల రాకతో కదిలిన లారీలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లిలో ఇసుక లారీలు అడ్డగోలుగా పరుగులు తీస్తుండడంతో ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఓ ఇసుక లారీ ఢీకొట్టడంతో ఓ మేక మృతి చెందింది. టీడీపీ కార్యకర్త రమేష్, మరికొంతమంది సదరు లారీ సహా ఇతర ఇసుక వాహనాలను అడ్డుకున్నారు. లారీ యజమానులు వారితో ఘర్షణకు దిగారు. తమ లారీలకు టాక్స్‌లు చెల్లిస్తున్నామని, ఆపడానికి మీరెవరు అంటూ వెళ్లిపోయారు. అనంతరం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన లారీలను టీడీపీ వారు, స్థానికులు అడ్డుకున్నారు. దీంతో ట్రాఫిక్ జాం అయింది. ఇరువర్గాల మధ్య కాసేపు స్వల్ప ఘర్షణ జరిగింది. గంటన్నర అనంతరం పోలీసులు రంగప్రవేశం చేశారు. లారీలకు వే బిల్లులు తనిఖీ చేసి పంపారు. తమ్ముళ్లు మాత్రం ఇసుక లారీలు వస్తే సహించబోమని తేల్చిచెప్పారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇసుక లారీలు రాకుండా చూడాలని స్థానికులు కోరారు. అధికారులకు చెప్పి నిర్ణయం తీసుకుంటామని పోలీసులు చెప్పారు. చివరికి టీడీపీ వారు ఆ మేకను ఢీకొన్న లారీ యజమాని నుంచి రూ.17 వేలు వసూలు చేశారు. ఆ మొత్తాన్ని మేక యజమానికి అందించారు.

కేఎల్‌యూలో అగ్నిప్రమాదాలపై అవగాహన



మంటను ఆర్పాల్సిన తీరుపై శిక్షణ ఇస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో సోమవారం ఫైర్ మాక్‌డ్రిల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లానింగ్, డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో సెక్యూరిటీ విజిలెన్స్ సిబ్బందికి ఈ కార్యక్రమానికి ఏర్పాటు చేశారు. మంగళగిరి స్టేషన్ ఫైర్ అధికారి వై. వెంకటేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాల నివారణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్న నిర్లక్ష్యం పెనుప్రమాదాలకు దారి తీసి తీవ్ర నష్టాలను కలిగిస్తుందని చెప్పారు. అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు, నివారణ మార్గాలను వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ ప్రసాద్, పీ అండ్ ఆర్ డీన్ డాక్టర్ వి.రాజేష్, డాక్టర్ జి.ఆర్.కె. ప్రసాద్, అసోసియేట్ డీన్‌లు డి. శేషిరెడ్డి, కె.జె. బ్రహ్మాచారి, వర్సిటీ ఫైర్ ఆఫీసర్ వై. మౌళిచంద్ పాల్గొన్నారు.

చక్కని చేతిరాతతో బంగారు భవిష్యత్తు

ఫిరంగిపురం: చక్కని చేతి రాతతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని హెచ్ఎం జహంగీర్ అన్నారు. మండలంలోని గుండాలపాడు గ్రామంలోని ప్రాథమిక ఉర్దూ పాఠశాలలో సోమవారం చేతిరాత నిపుణుడు జున్నూ ముద్రింపజేసిన పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. పుస్తకాల ద్వారా చూసి గుండ్రంగా రాయడం నేర్చుకోవచ్చని చెప్పారు.